క్లుప్తంగా

వాకింగ్ ట్రాక్, జిమ్ పరికరాలు ప్రారంభం



ప్రారంభిస్తున్న రోటరీ ప్రతినిధులు

పర్చూరు (చినగంజాం): రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో నాగులపాలెం చెరువు కట్టపై రూ. 6 లక్షలు నిధులు వెచ్చించి ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, జిమ్ పరికరాలను రోటరీ జిల్లా 3150 జిల్లా గవర్నర్ టీ రాజశేఖర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. రోటరీ క్లబ్ ఏర్పాటు చేసిన రోటరీ కమ్యూనిటీ క్రాప్స్ ద్వారా కొలసాని ఉదయభాస్కర్, చెంచులక్ష్మి రూ 2.5 లక్షల ఆర్థిక సాయంతో పాటు పర్చూరు రోటరీ క్లబ్ ఆర్‌సీసీ సభ్యులు సహకారంతో ఏర్పాటు చేసినట్లు ఆర్‌సీసీ అధ్యక్షుడు చాగంటి నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, ఒంగోలు, మార్టూరు, ఇంకొల్లు, నర్సరావుపేట ప్రతినిధులు జేవీ మోహనరావు, ఒంగోలు లక్ష్మీనారాయణ, జెట్టి స్వామి, సర్పంచ్ దాసి సుధారాణి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

204 సైకిళ్లు పంపిణీ..

అద్దంకి: రోరీ క్లబ్ ఆఫ్‌శింగకొండ ఆధ్వర్యంలో అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు 204 సైకిళ్లు స్థానిక ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పంపిణీ చేశారు. తిమ్మాయపాలెం పాఠశాలకు 45 సైకిళ్లను ఆమెరికాలోని తానా ఫౌండేషన్ సహకారంతో అందించినట్లు ప్రసిడెంట్ చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, సీఐ ఆర్ ఉమేశ్, ఎంఈవో వన్ పీవీ రాఘవరావు, ఎంఈవో సుధాకర్‌రావు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న మోపెడ్ వృద్ధుడికి గాయాలు

బల్లికురవ: మామిడి తోటకు కాపలా కాసేందుకు టీవీఎస్ ఎక్సెల్ బైక్ మీద వెళ్తుడగా ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో వృద్ధుడు గాయాలపాలయ్యాడు. ఈ ఘటన గురువారం రాత్రి కొప్పరపాడు-వినుకొండ రోడ్డులోని గొర్రెపాడు గ్రామ సమీపంలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద జరిగింది. అందిన సమాచారం ప్రకారం మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామానికి చెందిన ఈగ కృష్ణ నాగులవరంలో మామిడి తోటకు కాపలాగా వెళ్తున్నాడు. గొర్రెపాడు సమీపంలోకి వచ్చేసరికి ఆగిఉన్న లారీని గమనించక ఢీకొట్టాడు. స్థానికులు 108కి సమాచారం ఇవ్వటంతో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

వేటపాలెం: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు మువ్వల వెంకట రమణరావు పేర్కొన్నారు. మండలంలోని కొత్తపేటలో బీజేపీ తొమ్మిదేళ్ల పాలన సందర్భంగా ఇంటింటికి కరపత్రాలు గురువారం పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందుతున్న పథకాల గూర్చి వివరించారు. కార్యక్రమంలో చీరాల అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ కన్వీనర్ అర్వపల్లి కుమార్, పట్టణ అధ్యక్షుడు శంకర్ శెట్టి నాగేశ్వరావు, ఎస్సీ మోర్చా, కిసాన్ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి



ఏకలవ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎరుకల సేవాసమితి ప్రతినిధులు

చీరాల రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎరుకల సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం స్థానిక రామ్‌నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఏకలవ్య జయంతి వేడుకలను తుమ్మ శ్రీను, బచ్చు భారత్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాలపర్తి శ్రీనివాసరావు, ఇతర ప్రతినిధులు ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏకలవ్యుడు గురువు లేకుండా ఒంటరిగా ఎంతో జ్ఞానాన్ని సంపాదించారని, ఆయన మాదిరిగా అందరం జ్ఞానంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మొగిలి దీపిక గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అద్దంకి ఎస్సైగా అనిల్ కుమార్



అద్దంకి: స్థానిక పోలీసు స్టేషన్ ఎస్సైగా టీ అనిల్ కుమార్ నియమితులయ్యారు. గురువారం ఆయన పదవీ బాధ్యలు తీసుకున్నారు. ఈయన జిల్లా కార్యాలయంలో వీఆర్ నుంచి ఇక్కడకు వచ్చారు. తాత్కాలిక ఎస్సైగా అనిల్‌కుమార్ బాధ్యతలు నిర్వహిస్తారని జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి.

త్యాగం, ప్రేమలకు ప్రతీక బక్రీద్

- ఘనంగా బక్రీద్ పండుగ
- ప్రార్థనలు చేసిన ముస్లింలు
- కిటకిటలాడిన ఈద్గాలు, మసీదులు
- నోరూరించే మాంసాహారాలతో విందు



చీరాలలో బక్రీద్ ప్రార్థనల్లో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావు



చినగంజాంలో ఈద్గావద్ద ప్రార్థనల్లో ముస్లింలు



పర్చూరులో ఖురాన్ వాక్యాలు బోధిస్తున్న మత పెద్ద

మార్టూరు/చినగంజాం/కారంచేడు/యద్దనపూడి: ముస్లింల రెండో అతిపెద్ద పండుగ బక్రీద్. ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు ప్రసిద్ధి చెందిన ఈద్ ఉల్ అధా ముస్లింల పండుగల్లో ఒకటి. త్యాగాలకు ప్రతీకగా చెప్పే బక్రీద్‌ను ముస్లింలు భక్తి, శ్రద్ధలతో గురువారం జరుపుకున్నారు. ఉదయాన్నే నమాజ్ చేసిన తర్వాత పండుగ ప్రారంభమవుతుంది. ఈ రోజున వివిధ రకాల మాంసాహార వంటకాలు తయారు చేసుకొని ఇంటిల్లిపాది ఆనందంగా ఆరగిస్తారు.

మండల కేంద్రం మార్టూరు, వలపర్ల, బొబ్బేపల్లి, చిమ్మిరిబండ, కోనంకి తదితర గ్రామాల్లో ఈద్గాల వద్ద భక్తులు పెద్ద ఎత్తున హాజరు కాగా మతపెద్దలు ప్రత్యే ప్రార్థనలు నిర్వహించారు.

చినగంజాం, కడవకుదురు, చింతగుంపల, గొనసపూడి, సంతరావూరు, పెదగంజాం గ్రామాల్లో ముస్లింలు బక్రీద్‌ను పురస్కరించుకొని ప్రార్థనలు నిర్వహించారు. చినగంజాం, కడవకుదురు గ్రామాల్లో ముస్లింలు ఈద్గా, మసీదుల వద్దకు వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు.

ఇంకొల్లు మండలంలోని ఇంకొల్లు, పావులూరు తదితర గ్రామాల్లో బక్రీద్‌ను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఇంకొల్లులో ముస్లింలు మసీదుకు వెళ్లి సంప్రదాయరీతిలో ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు అల్లా బోధనలను వినిపించారు. అందరూ ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకొని ఆలింగనం చేసుకున్నారు.

త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పర్వదినాన్ని ఆచరించాలని ముస్లిం మత ప్రవక్తలు బోధించారు. బక్రీద్ పర్వదినాన్ని కారంచేడు మండలంలోని కారంచేడు, కుంకలమర్రు, దగ్గుబాడు, ఆదిపూడి, స్వర్ణ, కొడవలివారిపాలెం, గ్రామాల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వారి స్తోమతను బట్టి పేదలకు ఆహారం, పండ్లు, వస్త్రాలు బహూకరించారు.

పవిత్ర బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక అని పర్చూరు మస్జీద్ ఏ అతహర్ పేష్ ఇమామ్ షేక్ షాహిద్ అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా పర్చూరు మార్కెట్ యార్డులో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలు ఎక్కువ సంఖ్యలో ప్రార్థనలో పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం సోదర భావాన్ని చాటి చెప్పే విధంగా ఒకరికొకరు ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

బక్రీద్‌లో ఖుర్బానీ ముఖ్యమైనది..

అద్దంకి/అద్దంకి రూరల్/బల్లికురవ/మేదరమెట్ల: బక్రీద్ రోజున ఇంటిల్లిపాది ఖుర్బానీ చేయడం ఆనవాయితీ. రుచికరమైన మాంసాహారంతో అరగించి ఆనందంగా గడుపుతారు. జే.పంగులూరు మండల పరిధిలోని రామకూరు గ్రామంలో ముస్లింలు మసీద్ వద్ద మత పెద్దల సమక్షంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని పంగులూరు, చిన్నమల్లవరంలో పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొని ప్రార్థనలు చేశారు.

బక్రీదు పండుగను బల్లికురవ మండలంలో ఘనంగా నిర్వహించారు. వైదన, కొప్పరపాడు, కొమ్మినేనివారిపాలెం, అంబడిపూడి, వల్లాపల్లి, చెన్నుపల్లి, కొణిదెన, ఉప్పుమాగులూరు, కోటావారిపాలెం గ్రామాల్లో ముస్లింలు ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

మేదరమెట్ల అద్దంకి రోడ్డులో గల ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ రోజున లేనివారికి సాయం చేస్తే అల్లా కరుణిస్తాడని మత ప్రవక్తలు బోధించారు. ఆసీఫ్‌సాబ్ హబీబుల్లా, సర్దార్‌ఖాన్, హుస్సేన్, రసూల్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మార్టూరులో..



దగ్గుబాడులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మేదరమెట్లలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు



రామకూరు గ్రామంలో పార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



ఇంకొల్లులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



వైదనలో ఆలింగనం చేసుకుంటున్న ముస్లింలు

శుభాలకు ప్రారంభం తొలి ఏకాదశి



కొండాయపాలెంలో అలంకరణలో కోదండ రామస్వామి



అలంకరణలో పూనూరు త్రిపురాంతకేశ్వరస్వామి



చీరాలలో గరుడవాహనంపై ఊరేగుతున్న మదనగోపాలస్వామి

- ఘనంగా తొలి ఏకాదశి
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

చీరాల అర్బన్: తొలి ఏకాదశి పురస్కరించుకుని గురువారం పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పేరాలలోని మదన గోపాలస్వామి దేవాలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు ఆర్‌వీ రంగాచార్యులు, చెన్నకృష్ణమాచార్యులు శాస్త్రోక్తంగా వ్రతాలునిర్వహించారు. తొలిఏకాదశి రోజున మహావిష్ణువు యోగనిద్రలోకి వెళ్లే విశేషమైన రోజని, ఆ రోజును తొలిఏకాదశి, శయన ఏకాదశి అని పిలుస్తారన్నారు. ఈ రోజు స్వామివారిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలానే పట్టణంలోని ముత్యాలపేటలో తొలి ఏకాదశిని పురస్కరించుకుని మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద ప్రత్యేక పూజలు, విశేష హోమాలను నిర్వహించారు. మహాలక్ష్మి, మహాదుర్గ, మహా సరస్వతి సహిత మహా గణపతి హోమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కమిటి సభ్యులు దామర్ల గోపీనాథ్, జి.రమేష్, ధనలక్ష్మి, పెద్దసంఖ్యలో పాల్గన్నారు. అలానే పాపరాజుతోటలోని శ్రీకృష్ణ గోశాలలో గురువారం తొలిఏకాదశిని పురస్కరించుకుని గోమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు దిట్టకవి వాసుదేవాచార్యులు వీరరాఘవస్వామికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

మార్టూరు/కారంచేడు/చినగంజాం/యద్దనపూడి: నియోజకవర్గంలో తొలిఏకాదశిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మార్టూరు మండలంలోని పలు గ్రామాల్లోని ఉదయం నుంచే ఆలయాల వద్ద భక్తులు పెద్ద ఎత్తున హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కారంచేడు పెద బజారు శివాలయం, గంగమ్మ గుడి, సాయిమందిరం, వెంకటేశ్వరస్వామి ఆలయం, వైష్ణవీ దుర్గామాత ఆలయం, కట్టమల్లేశ్వరస్వామివారి ఆలయంతో పాటు వేణుగోపాల స్వామి వారి గుడిలోను భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. యద్దనపూడిలోని పూనూరు త్రిపురాంతకేశ్వరస్వామి, గన్నవరం విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో తొలి ఏకాదశి సందర్భంగా అర్చకులు, ప్రజలు పూజలు చేశారు.

అద్దంకి/జే.పంగులూరు/అద్దంకి రూరల్/మేదరమెట్ల/బల్లికురవ: తొలిఏకాదశి రోజున ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జే.పంగులూరు మండల పరిధిలోని రామకూరు గ్రామంలో గంగా బాల త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వర స్వామిని వారి భక్తులు దర్శించుకున్నారు.

ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండపై వేంచేసియున్న లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వాతీ నక్షత్ర సందర్భంగా, తొలి ఏకాదశిలో భాగంగా 25 మంది దంపతులతో ధర్మకర్తల మండలి చైర్మన్ నర్రావుల కొండలు ట్రస్ట్ సభ్యులు కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో కోటిరెడ్డి పాల్గొన్నారు.

ఆషాఢ మాస ఏకాదశి ఎంతో విశిష్టత ఉందని ఉత్తర దిశగా ఉన్న సూర్యుడు దక్షిణ దిశగా మారుతున్నట్లు కనిపిస్తాడని కొత్తపాలెం, కొండాయపాలెం, కొమ్మినేనివారిపాలెం గ్రామాల్లోని రామాలయ అర్చకులు ఐవీ సుబ్బాచార్యులు, మారుతి నరేశ్, ఎన్ అనీల్ కుమార్ అన్నారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆయా గ్రామాల్లోని అమ్మవార్లను, స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈ పండుగ రోజున సత్యనారాయణస్వామి వ్రతం ఆచరిస్తే సూర్య, చంద్ర గ్రహణాలయందు భూమి దానం చేసినంద ఫలితం లభిస్తుందని అర్చకులు తెలిపారు.



అద్దంకి: కల్యాణంలో పాల్గొన్న భక్తులు



కారంచేడు పెద్దబజారు శివాలయంలో ప్రత్యేక పూజల్లో భక్తులు



జే.పంగులూరు: స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



వృద్ధురాలితో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- ఏపీ శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

మేదరమెట్ల: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అందులో భాగంగానే నవరత్నాల సంక్షేమ పథకాలను అమలు చేశామని శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు గురువారం మేదరమెట్ల మండలంలోని సోమవరప్పాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లిన చైతన్య అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.ఎలీశమ్మ, మాజీ సర్పంచ్ ఆనందరావు, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ కోయి అంకారావు, వై.బ్రహ్మారెడ్డి, మన్నె సుబ్బారావు, వార్డు మెంబర్లు పార్టీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే అధిక ప్రాధాన్యత



సమస్యలు తెలుసుకుంటున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి

పర్చూరు (చినగంజాం): ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తాను ముందుకు సాగుతున్నట్లు పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ పేర్కొన్నారు. గురువారం ఆయన పర్చూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ప్రజలతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని మండలాలు వారీగా వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఆయన వివరించిన సమస్యలను గురించి అధికారులతో మాట్లాడి పలు సమస్యలను అప్పటికప్పుడే పరిష్కారం చూపారు. గ్రామాల్లో ప్రజలు తమకున్న సమస్యలను తన దృష్టికి తీసుకుని రావాలని, సమస్యలను సత్వరమే పరిష్కరించి ప్రజలను ఆదుకుంటానన్నారు. జూలై 1 నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కఠారి అప్పారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మండల జేసీఎస్ ఇన్‌చార్జ్‌ల నియామకం

అద్దంకి: మండల జేసీఎస్ ఇన్‌చార్జ్‌లను గురువారం వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. అద్దంకి మండల ఇన్‌చార్జిగా ఇస్తర్ల వెంకట్రావ్, అద్దంకి మున్సిపల్ ఇన్‌చార్జిగా పూనూరి చైతన్య కిశోర్, బల్లికురవకు తిరుకోవిళ్లూరి నరేష్, జే.పంగులూరుకు భవనం వెంకట్రామిరెడ్డి, సంతమాగులూరుకు ఇన్‌చార్జిగా ఎస్కే మహమ్మద్‌రఫీ, కొరిశపాడు మన్నెం వేణులను నియమిస్తూ లేఖ విడుదల చేసింది.

పర్చూరు నియోజకవర్గం..

చినగంజాం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి ఆదేశాల మేరకు జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లను నియమించారు. చినగంజాంకు కోమట్ల శివరామిరెడ్డి, ఇంకొల్లుకు ఎస్‌కే మస్తాన్ వలి, కారంచేడుకు యార్లగడ్డ శ్రీకాంత్‌బాబు. మార్టూరుకు గర్నెపూడి రవిచంద్, పర్చూరుకు ముప్పాళ్ల రాఘవయ్య, యద్దనపూడికి ధూళిపాళ్ల వేణుబాబు నియమితులైనట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి.

చీరాల నియోజకవర్గం..

చీరాల: నియోజకవర్గంలో చీరాల మండల జేసీఎస్ ఇన్‌చార్జ్‌గా బుర్ల సాంబశివరావు, చీరాల-1కు కొల్లా శివకృష్ణ, చీరాల-2కు దాసరి రామకృష్ణ ప్రసాద్, వేటపాలెం మండలానికి లేళ్ల శ్రీధర్‌లను నియమించారు.

చట్ట సవరణ బిల్లు విరమించుకోవాలి

చీరాల అర్బన్: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన విద్యుత్ చట్టసవరణ బిల్లులో భాగంగా స్మార్ట్ మీటర్లను తీసుకువచ్చి ప్రజల సొమ్మును దోపిడి చేసేందుకు కుట్ర పన్నిందని, వెంటనే ఆ బిల్లును విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య అన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గడియార స్థంబం సెంటర్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ఎన్.బాబూరావు, పట్టణ నాయకులు ఎం.వసంతరావు, పి.కొండయ్య, ఎల్.జయరాజు తదితరులు పాల్గొన్నారు.

బూదవాడలో రాతి శివాలయం పునఃనిర్మాణం



నిర్మాణంలో ఉన్న రాతి శివాలయం

జే.పంగులూరు: మండల పరిధిలోని బూదవాడ గ్రామంలో శివాలయం పునఃనిర్మాణం జరుగుతున్నట్లు ఆలయ కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆలయ రాతి నిర్మాణానికి రూ. 1 కోటి పైగా అవన్నుట్లు తెలిపారు. ఎండోమెంట్ రూ. 30 లక్షలు నిర్మాణ ఖర్చులకు మంజూరు చేయగా, గ్రామస్తులు, దాతల సహకారంతో రూ. 70 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. నియమ నిబంధనలచే చిలకలూరిపేట పురుషోత్తం పట్టణం వారిచే నిర్మాణం జరగుతున్నట్లు తెలిపారు. ఆలయ నిర్మాణం ఇప్పటికే 20 శాతం జరిగినట్లు తెలిపారు.

కుందేరు ఆక్రమణలపై విచారణ

చీరాల: కుందేరు ఆక్రమణలపై ఇరిగేషన్ అధికారులు గురువారం విచారణ చేపట్టారు. మాజీ మంత్రి పాలేటి రామారావు కుందేరు ఆక్రమణలపై ఇటీవల స్పందనలో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా కొత్తపేట వద్ద ఉన్న కొన్ని అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేయగా డ్రైనేజీ ఈఈ మురళీకృష్ణ, డీఈ సుబ్బారావులు విచారణ జరిపారు. సమావేశంలో కటకం శ్రీనివాసరావు, పాకల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25431

చీరాల డివిజన్

90101 55593 (చీరాల)

Office mail : sakshiongads@gmail.com